# 10. పట్టపగలు చుక్కలు పొడిచిన కథ

ఆఫీసు పదిన్నరకి.

అప్పుడే తొమ్మిదింపావు దాటిపోయింది.

ఈ మహా ఇల్లాలు ఇంకా వంట ప్రయత్నం సీరియస్‌గా చెయ్యడం లేదని వొళ్లు మండు కొస్తోంది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథ వొకటి రోజూ గుర్తుకొస్తుంది; ఈ ఇల్లాలు వంట లేటుగా మొదలెట్టడం గురించి,

ఆ కథలో ఒక ఇల్లాలు-

మొగుడికి నాలాగా ఆఫీసు అడావుడీ లేకపోయినా అతడు ఆకలి కూటి వాడని తెలిసీ కూడా- వంటెంత వరకొచ్చిందోయ్- అని అతడు అడిగితే -

"ఇదిగో అన్నం వార్చడమేమిటి, విస్తట్లో కుంభం బోర్లించడమేమిటి-" అన్న ధోరణిలో మొదలెడుతుంది.

అతగాడు అలా పరిశోధన చేసుకుంటూ పోతే చివరికి - కడిచిన రాత్రి వంట చేసిన పొయ్యి ఇంకా అలకలేదు. గిన్నె తోముకోలేదు. చెరువు కెళ్లి నీళ్లు తెచ్చుకోలేదు. ఆఖరికి ఆవిడ గారు ఇంకా అప్పటికి చల్డి వణ్ణమే తిన్లేదు - అని తేల్తుంది.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథ లెవెల్లో కాకపోయినా అంతలాంటి ఆలస్యం మా ఇంట్లో తరచూ జరుగుతుంది.

పోనీ ఆఫీసులో మేనేజర్‌గారు కాస్త ఇదైన వాడా అంటే అతగాడు ఠంచనుగా పదింపావుకి తన సీట్లో ఎక్కి; పది గంటల నలభై నిమిషాలు అయ్యేసరికి హాజరుపట్టీ తెప్పించి ఎవరెవరు పదిన్నరకి రాలేదో అందరి పేర్లకి ఎదురుగా ఎర్రరంగులో రాసే స్కెచ్చి పెన్నుతో లేటు లేటు లేటు అని రాసేసి మేనేజింగ్ డైరెక్టరు గారి బల్లమీదకి రవాణా చేసేసే నిజాయితీ గల మనిషాయెను. ఒకే నెలలో మూడు లేటు మార్కులు పడితే ఒకరోజు సెలవు ఖర్చు రాసేస్తారు. సెలవు నిలవ లేకపోతే జీతం కోసేస్తారు కూడాను.

"ఏం సౌభాగ్యలక్ష్మమ్మ తల్లీ; వంటెంత వరకు వచ్చింది?" అని అడిగాను.

"వంట వూసు మీకెందుకు; మీరేం వార్చేవారా తీర్చేవారా? వొడ్డిస్తే తినడం వరకేగా మీ ప్రతాపం!" అంది.

"అది కాదు. నేను ఆఫీసుకి వెళ్లాలి; గుర్తుందా?"

"మరి అత్తిసరు పెడితే అన్నం గట్టిగా ఉంటోంది; అరిగి చావడం లేదంటారు మీరేను. అందుకని యసరు పెట్టేను."

"నా ఉద్యోగానికి యసరు పెట్టేస్తావు నువ్వు చివరికి" అని మనస్సులో అనుకొని; "ఎప్పుడనగా పెట్టావు యసరు. ఆ నీళ్లు కాస్తా యిగిరిపోయి గిన్నె అడుక్కి చేరిపోకముందే

దాంట్లో ఇన్ని బియ్యం పోస్తే అన్నం కళ్లబడుతుంది" అన్నాను.

"బియ్యం ఏరుతున్నాను, చూసేరా మరి?"

"బియ్యం ఏరుతున్నావా, బియ్యంలో రాళ్లు ఏరుతున్నావా?" అన్నాను పెద్ద జోక్ వేసినట్టు."ఇవిగో తమరు తెచ్చిన బియ్యం వోసారి చిత్తగించండి, ఇందులో రాళ్లు ఏరుతూ కూచుంటే వంట రేపటికే గాని ఇవాల్టికి కాదు. అందుకని బియ్యమే ఏరుతున్నాను."

"ఈ లెక్కన వంట ఎప్పటికవుతుందో?"

"పోన్లెండి. ఈ ఏరిన పిడికెడు బియ్యం మీకు వండేసి మీరు ఆఫీసు కెళ్లాక నేను వేరే వొండుకుంటాన్లెండి."

మరో ఎనిమిది నిమిషాలయ్యేక "భాగ్యం!" అని కేక పెట్టేను.

"ఇదిగో, వస్తున్నా!"

"నువ్వు రానక్కర్లేదు బాబూ! వంటెంత వరకొచ్చిందని అడుగుతున్నానంతే-"

గరిటతో సహా వచ్చింది. "మీరలా తొందరపడితే యెలాగండీ? కందిపప్పు వేపుతున్నాను. అదవగానే వుడకబెట్టి - అదుగో మొహం మటమట్లాడిస్తున్నారు! కందిపప్పు పచ్చిది వండితే సయించదు మళ్లానూ. రుచులు కావాలి, రుచులు!"

"తొమ్మిదిన్నర కావస్తోందే, నా మహాభాగ్యలక్ష్మీ తల్లీ. ఇలా నువ్వు వాయిదాల పద్ధతి మీద వంట వండితే ఇవాళ కూడా లేటు మార్కు పడిపోతుంది. ఇవాళ ముప్ఫయ్యొకటో తారీఖు. ఇంతకు ముందే ఈ నెలలో నాకు రెండు లేటు మార్కులు పడ్డాయి. ఇవాళ మూడోది గానీ పడ్డాదా 80 రూపాయలు గోవిందా. అందుకని-"

"అయితే ఏం చెయ్యమంటారు నన్ను?"

"ఇంతకంటా హోటల్లో భోంచేసి ఆఫీసుకి పోవడం మేలు."

"అయితే ఐదు నిమిషాలు ఆగండి."

"ఈలోగా వంట అయిపోతుందా?"

"అహ, అదికాదు. నేను కూడా ఈ లోగా చీర మార్చుకు వచ్చేస్తాను; ఇద్దరం హోటల్లోనే తిందాం యించక్కా."

"హా?" అని వెనక్కి జారబడిపోయాను కూర్చున్న కుర్చీలోనే.

గోముగా మొహం పెట్టి దగ్గరికొచ్చేసింది "భాగ్యం."... "అది కాదండీ. ఇన్నిసార్లు సినిమాలకీ, ఎగ్జిబిషన్లకీ, సర్కస్‌లకీ, మేజిక్ షోలకీ తీసుకెళతారు. వొక్కసారైనా హోటలుకి భోజనానికి తీసికెళ్లరేమండీ. నా దగ్గిర డబ్బులున్నాయి లెండి-"

"సరే, పద!" అని స్కూటర్ తీసేను. ఐదు నిమిషాలన్న మనిషి అక్షరాలా రెండున్నర నిమిషాల్లో చీర మార్చేసుకుని; కుక్కర్‌లో పెట్టిన పప్పు, కూర, పులుసు పాడైపోకుండా స్టవ్ ఆర్పేసి ఇంటికి తాళం పెట్టేసి వీధి గుమ్మం దిగి; పక్క వాటా జానికమ్మ గారికి తాళాలు కూడా వప్పగించి "ఊ పదండి మరి!" అంది.

నేను ట్రాఫిక్కు చూసుకుంటూ స్కూటర్ మెల్లిగా పోనిస్తూ వున్న సమయంలో ఆవిడ

హోటళ్ల బోర్డులన్నీ చూస్తోంది గావును; "గాంధారి" అనే హోటల్ దగ్గరికి రాగానే 'ఆపండాపండి' అంది.

ఆపి "ఏంటి సంగతి?" అన్నాను.

"ఈ హోటల్లో తిందాం, దిగండి." అంది.

అడిగిందే ఒక్క వరం. అదేం "భాగ్యం" అలాగే కానీ - అనుకుని లోపలికి నడిపించాను బండి. ఇంతకీ డబ్బులు తన దగ్గర ఉన్నాయంటోందిగా, తేదీ 31 అయినా!

తొమ్మిదీ ముప్ఫయ్యయిదు.

పార్కింగ్ స్థలంలో జాగా చూసుకుని స్కూటర్ అక్కడ పెట్టి అద్దాల తలుపు దగ్గిర కెళ్లేసరికి తొమ్మిది ముప్పయ్యేడు.

గూర్ఖావాడు వొంగి వొంగి సలాంలు కొట్టి ఏరిండియా మహారాజులా స్వాగతం చెప్పగా; "గాంధారి" వారి లాడ్జింగ్ -కమ్-బోర్డింగ్ -కమ్ బార్ అండ్ రెస్టారెంట్ - కమ్ స్విమ్మింగ్ పూల్ - కమ్ కాన్ఫరెన్స్‌హాలు - కమ్ షాపింగ్ ఆర్కేడ్ - కమ్ దిస్ కమ్ దట్ - కాంప్లెక్సులో "జలంధర" అనే సబ్‌నేమ్ అనగా ఉపనామం కలిగిన శాకాహార భోజన మందిరం చేరేసరికి తొమ్మిదీ నలభై. అందులో ప్రవేశించి ఆ చల్లదనం ఆకలి వేడిని అధికం చేస్తూ ఉండగా ఆ చీకట్లో ఖాళీగా ఉన్న టేబుల్ ఎక్కడున్నా దెక్కడున్నాదని వెతుక్కుంటూ ఎవర్నీ ఢీ కొట్టకుండా యేదీ తన్నుకోకుండా చెరో కుర్చీలోను సెటిలయ్యేసరికి - తొమ్మిది నలభై అయిదు.

రెండు నిమిషాల పాటు మా దగ్గరి కెవరూ వొచ్చి మీకేం కావాలని అడగలేదే అన్న బాధ కలగలేదు. కానీ మూడో నిమిషం నుంచి దిక్కులు చూడ్డం మొదలెట్టాం. ఆఖరికి వొకడొచ్చాడు. తెల్లటి కోటు, తెల్లటి పంట్లాం, ఎర్రటి నడుం బెల్టు; నెత్తి మీద మూరెడు ఎత్తుగల టోపీ వంటి పాగా; దానిమీద కోడిజుట్టులా, నెమలి పింఛంలా ఒకానొక అలంకార విశేషంతో-

వాడు ఆ టేబిలు మీద మా ఇద్దరికీ ఎదురుగా చెరోటి; అరతావు సైజు దళసరి అట్టగల పుస్తకాలు పెట్టేడు. తీరాచూస్తే అవి పుస్తకాలు కాదు. కేవలం రేట్లు చెప్పే అట్టలు మాత్రమే. వాటిని ఒక నిమిషంలోగా చదివేసి "రెండు విజిటేరియన్ మీల్స్!" అన్నాను.

పావుగంటలో రెండు కంచాల్లో అన్నీ వొడ్డించి తెచ్చాడు. రెండు కంచాలకి మధ్య; గోంగూర పచ్చడి, ఆవకాయ, కందిపొడి ఉన్న గిన్నెల గుత్తి ఒకటి పెట్టాడు. ఫోర్కులు, చెంచాలు, ఐస్ నీళ్లు, చేతులు తుడుచుకుందుకి కాగితపు రుమాళ్లు ఆ పక్కని పెరుగుతో, చారుతో, సాంబారుతో, రెండేసి చిప్ప గిన్నెలు - ఈ పక్కని ఉప్పు చిప్ప. రెండు అతిచిన్న గిన్నెల్తో "నెయ్యి" (ఆ నెయ్యి నాణ్యత ఎలా వున్నా ఆ గిన్నె ఎంతో గొప్పగా వుంది. గిన్నె నిండా పోస్తే చెంచాడు నెయ్యి కన్నా పట్టదు. అలాంటివి ఓ వంద గిన్నెలు కొనేసి, కొలెస్టరాల్ అధికంగా ఉందని బాధపడుతున్న నా స్నేహితులు తొంభై తొమ్మిది మందికీ తలోటీ ఇచ్చేసి నేనొకటి ఉంచుకో వచ్చునని ఆలోచన వచ్చింది. అది వేరే సంగతి.)

ఆఫీసుకి వెళ్లడం నిద్రపోడానికి కాదు గనుక నేను క్లుప్తంగా ముగించినా మా"భాగ్యం" మాత్రం అదే మహాభాగ్యంలా ఆవురావురుమని అన్ని ఐటములూ మారు వొడ్డించుకుని అక్షరాలా

ఆడవాళ్లు భోంచేసినంత ఆలస్యంగా భోంచేసింది. మధ్యలో టైమ్ చూస్తే "మీ కన్నీతొందరే" అని దేనికి దేనికి లింకు పెడుతుందో అన్న భయంతో వూరుకుని చివరికి అంతా అయ్యేక టైమ్ చూసాను. పదీ నలభయ్!

అప్పుడు ఆ నెమలి పింఛం ధారుడు ఒక పెద్ద ప్లేటులో ఒక పావుసేరు వేయించిన సోపుగింజల మధ్యని పెట్టి బిల్లు పట్టుకొచ్చాడు. రెండు అరటి పండ్లు, రెండు కిళ్లీలు బోనస్.

"హోటల్ గాంధారి; నగరంలోని ఏకైక ఐదు నక్షత్రాల హోటల్" అని అందమైన అచ్చులో వుంది. చేత్తో రాసింది- రెండు వెగ్ మీల్స్ - 28 రూపాయలు. టాక్స్ రెండు రూపాయల నలభై పైసలు; వెరసి ముప్పయి రూపాయల ఎనభై పైసలు. థాంక్యూ. మళ్లీ రండి!

ఐదు నక్షత్రాలు అంటే ఐదు చుక్కలేగా! పట్టపగలు చుక్కలు పొడిచేయంటే పొడవ్వా మరి?

బిల్లు చెల్లించి టిప్పు ఇచ్చి బైటపడేసరికి టైమ్ పదకొండు. అయితే - గేటు దగ్గిర నారాయణరావు కనిపించి "ఆఫీస్‌కి సెలవు గురూ!" అని ఎవరో మాజీ మంత్రిగారు పోవడం అదంతా చెప్పుకొచ్చేసరికి ఎనభై రూపాయల నష్టం యాభైకి దిగింది కదాని సరదా వేసింది.

సెలవేకదా, ఏదో ఇంత తిన్నాం కదా, అని అక్కడా అక్కడా తిరిగి ఇంటికెళ్ళేసరికి తలుపు తీసుంది. లోపల మా బావమరిది గావంచా కట్టుకుని ఎదురొచ్చేడు. "రాత్రంతా తిండి, నిద్దరా లేదే అక్కయ్యా. వొంటింట్లో చూస్తే తాళింపులు మినహా అన్నీ రడీగా వుంటేనూ; అదే పదివేలని అన్నిట్లోనూ పోపులు వేసుకుని వొడ్డించుకు తినేసేను. నేనిప్పుడు అర్జంటుగా ఊళ్లోకి పనిమీదెళ్లాలి. అదిసరే గాని, అక్కా! అంతంత కొంచెం వొండుకుని ఎలా తింటున్నారే?" అన్నాడు.

మళ్లీ పట్టపగలు చుక్కలు పొడిచినట్టయింది! ★

# 11. లిఫ్ట్ ప్రవీణుడు

**కె.** అండ్.కె. కంపెనీ వాళ్లు మా ఆఫీసుకి సరఫరా చేస్తామని వొప్పుకున్న ఫర్నిచర్ తణికీ చెయ్యడానికి నేనూ, మా ఎకౌంట్స్ ఆఫీసర్ రమేశం గారు, మా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం గారూ ఈ పూట వెళ్లాలి. ఇద్దరూ సీట్లలో లేరు. వాళ్లిద్దరి స్టెనోలూ అసలీ తణికీ సంగతే తమకి తెలీదన్నారు. అనుకున్న టైం దగ్గర పడుతోంది.

సరిగ్గా అప్పుడొచ్చింది, హోటల్ మేనకా నించి ఫోను. రమేశం గారు మాట్లాడేరు. "మనం ముగ్గురం కె.అండ్.కె. కంపెనీకి వెళ్లాలి కదా. మీరు జనరల్ మేనేజర్ గారి జీపు అడిగి తీసుకుని మేనకా హోటల్‌కి వొచ్చేయండి. నేను జి.ఎం. గారికి ఫోన్లో చెప్పేను, ఆయన జీపు ఇస్తారు." అన్నారు.

తీరా జీపు దగ్గిరకొచ్చేటప్పటికి స్టెనో రమణారావు "సార్, జీపు తమరే నడుపుకెళ్లాలి సార్. డ్రైవర్ సుబ్బయ్య ఇవాళ సెలవ్, సార్!" అని చెప్పి తాళాలిచ్చేడు.